క్లుప్తంగా

పల్లె వెలుగు బస్సులు ప్రారంభం


బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌ఎం రజియా సుల్తానా

బనగానపల్లె: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి రెండు పల్లె వెలుగు బస్సు సర్వీసులను ఆర్‌ఎం రజియా సుల్తానా శుక్రవారం ప్రారంభించారు. నంద్యాల, తాడిపత్రి రూట్లలో ఈ బస్సులు నడుస్తాయని తెలిపారు. కొత్త బస్సుల రాకతో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిని దృష్టిలో ఉంచుకుని ఈ రెండు రూట్లలో సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఎం తిరుపతయ్య, ఎస్టీఐ వెంకటన్న పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు


టమాట పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ

బేతంచెర్ల: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని డోన్ వ్యవసాయ శాఖ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామంలో ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పత్తి, టమాట పంటలను పరిశీలించారు. రసం పీల్చే పురుగుల నుంచి పత్తి పంటను కాపాడుకోవడానికి వాడాల్సిన నివారణ మందులతో పాటు, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పంట నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు సురేష్, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

డోన్ రూరల్: మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామంలో శుక్రవారం చిన్నమల్కాపురం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి ప్రభాకర్, సూపర్‌వైజర్ చెన్నయ్య ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వర్షాలు కురుస్తుండడంతో దోమలు వృద్ధి చెంది మలేరియా, టైఫాయిడ్ , డెంగీ జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమ తెరలు వినియోగించడంతో పాటు పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు.

ఘనంగా మహేష్‌బాబు జన్మదినం


విద్యార్థులతో కలిసి సంబరాలు చేసుకుంటున్న మహేష్ అభిమానులు

డోన్ టౌన్: సినీ నటుడు మహేష్‌బాబు జన్మదిన వేడుకలను శుక్రవారం డోన్‌లో ఘనంగా జరుపుకున్నారు. మహేష్‌బాబు, కృష్ణా ఫ్యాన్స్ డోన్ మండల అధ్యక్షుడు ఖాదర్ ఆధ్వర్యంలో కేవీఎస్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. విద్యార్థులకు పెన్నులు, చాక్లెట్‌లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం సుంకన్న, ఉపాధ్యాయులు మాణిక్యంశెట్టి, రాజా విజయ్‌కుమార్, అభిమానులు జమాత్‌వలి, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

డోన్ తహసీల్దార్‌గా నాగమణి



డోన్ టౌన్: మండల తహసీల్దార్‌గా నాగమణిని నియమిస్తూ కలెక్టర్ రాజకుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న మాధవకృష్ణారెడ్డి ఎన్నికల అనంతరం వైఎస్సార్ జిల్లాకు తిరిగి వెళ్లారు. ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పజెప్పారు. తాజాగా నాగమణిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

డోన్‌కు మొదటి మహిళా ఎస్‌ఐ


మమత

డోన్ టౌన్: డోన్ అర్బన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా మమత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు మహిళా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆమెను సాధారణ బదిలీల్లో భాగంగా డోన్ స్టేషన్‌కు బదిలీ చేశారు. డోన్ పోలీస్‌స్టేషన్ చరిత్రలో మొట్టమొదటి మహిళా ఎస్‌ఐగా మమత నియమితులు కావడం విశేషం. బాధ్యతలు తీసుకున్న అనంతరం సీఐ ఇంతియాజ్ బాషా, పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ పని చేస్తున్న శరత్‌కుమార్‌రెడ్డిని నంద్యాల ఎస్పీ కార్యాలయానికి బదిలీ చేశారు.

దుస్థితిలో ఎస్సార్‌బీసీ కాల్వలు

- చివరి ఆయకట్టు వరకు అందని సాగునీరు
- ఆయా మండలాల్లో 1.62 లక్షల ఎకరాల ఆయకట్టు
- ఆందోళనలో రైతులు


9వ బ్లాక్ దుస్థితి


కుచించుకుపోయిన 8వ బ్లాక్ సబ్ మైనర్ కాలువ

బనగానపల్లె: గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వకు అనుసంధానంగా ఉన్న 13 బ్లాక్‌లు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. చాలా కాలం నుంచి ఈ కాల్వలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో నీరు సక్రమంగా పారడం లేదు. దీంతో పంట సాగు చేస్తున్న ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎస్సార్‌బీసీ ఆయకట్టు పరిధిలో నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, సంజామల మండలాలతో పాటు పాణ్యం, నంద్యాల, గోస్పాడు మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1.62లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది.

వైఎస్సార్ హయాంలో తొలిసారి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో ఎస్సార్‌బీసీకి మొదటిసారిగా నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఈ కాల్వల అభివృద్ధిపై దృష్టి సారించలేదు. రాయలసీమ ప్రాంతానికి ఎస్సార్‌బీసీ వరప్రదాయినిగా ఆయకట్టు రైతులు భావిస్తారు. మేజర్, మైనర్, సబ్ మైనర్ కాల్వలు ఎక్కడ చూసినా అద్వాన స్థితికి చేరుకున్నాయి. పంట కాల్వలు సరిగ్గా లేనందున నీరు ఆయకట్టు భూములకు అందక వృథాగా కోవెలకుంట్ల సమీపంలోని కుందూనదిలో చేరుతున్నాయి. వీటి అభివృద్ధికి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పంపుతున్న ప్రతిపాదనలకు స్పందన కరువైంది. నిధులు మంజూరు కావడం లేదు. ఆయకట్టు పరిధిలో ఎక్కువగా ఖరీఫ్‌లో మొక్కజొన్న, మిరప, వరి, రబీలో వరి, మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు తదితర పంటు సాగు చేస్తారు.

పంపుసెట్లే గతి

ప్రధాన కాల్వల వద్ద పంపుసెట్లను ఏర్పాటు చేసుకుని చివరి ఆయకట్టు పంటలకు నీటి తడులను అందించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విధంగా అందించడం వల్ల రైతులకు ఎకరానికి రూ.4 నుంచి 5వేలు అదనపు పెట్టుబడి వస్తున్నట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. అయినా పంపుసెట్ల ద్వారా లభించే నీరు పంటలకు సరిపోవడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి కాల్వలను అభివృద్ధి చేసి చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

గత ఏడాది ఎస్సార్‌బీసీకి చెందిన అన్ని కాల్వల అభివృద్ధికి రూ.50 కోట్లతో ప్రతిపాదనలు పంపాం . నిధులు మంజూరు కాలేదు. మళ్లీ ప్రతిపాదనాలు తయారు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే కాల్వలను అభివృద్ధి చేస్తాం. ఆయకట్టు రైతులందరికీ సాగు నీరందించడానికి కృషి చేస్తాం. –సురేష్‌బాబు, ఈఈ, ఎస్సార్‌బీసీ

పంట కాల్వలు అభివృద్ధి చేయాలి



చాలా కాలంగా ఈ కాల్వనే నమ్ముకుని వ్యవసాయం చేస్తున్నాం. అయితే కొంత కాలంగా నీరు సక్రమంగా రావడం లేదు. దుస్థితిలో ఉన్న ఎస్సార్‌బీసీ పంట కాల్వలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి. ప్రధాన కాల్వ ద్వారా నీరు సమృద్ధిగా వెళుతున్నా ఆయకట్టు భూములకు సాగునీరు సక్రమంగా లభించడం లేదు. ఇప్పటికైనా అధికారులు కాల్వల అభివృద్ధిపై దృష్టి సారించాలి.

–వీరారెడ్డి, రైతు, విఠలాపురం, బనగానపల్లె

చివరి ఆయకట్టుకు అందడంలేదు



చివరి ఆయకట్టుకు సాగు నీరందక వ్యవసాయ పంపుసెట్ల ద్వారా నీటిని పొందుతున్నాం. ఈ సమస్య వల్ల రైతులు అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోంది. పంట కాల్వలు సరిగ్గా లేనందున ఆయకట్టు భూములకు నీరు అందడంలేదు. సాగులో ఎంత కష్టపడినా నీరు సక్రమంగా అందకుంటే నష్టపోయే ప్రమాదం ఉంది.

–నరసయ్య, కౌలు రైతు, ఇల్లూరుకొత్తపేట, బనగానపల్లె

కళాశాలలో ఆడిటోరియం ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పూర్వ విద్యార్థి శిల్పా ప్రతాప్‌రెడ్డి

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థి ఆర్థిక సహకారంతో నిర్మించిన ఆడిటోరియాన్ని శుక్రవారం ప్రారంభించారు. కళాశాల ఆవరణలో ప్రార్థన సమయంలో విద్యార్థులు వర్షాకాలంతో తడుస్తూ, వేసవిలో ఎండ తీవ్రతకు ఇబ్బంది పడుతుండంటంతో గుర్తించిన పూర్వ విద్యార్థి శిల్పా ప్రతాప్‌రెడ్డి రూ. 14 లక్షలు ఆర్థిక సాయం అందించడంతో ఇటీవలే ఆడిటోరియం నిర్మించారు. ప్రారంభోత్సవానికి పూర్వ విద్యార్థులైన మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై నిరసన



బేతంచెర్ల పాత బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

బేతంచెర్ల: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ కంపెనీలను తరిమికొట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు భార్గవ్, మధుశేఖర్ అన్నారు. శుక్రవారం కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పాత బాస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేశారు. సేవ్ అగ్రికల్చర్.. క్విట్ కార్పొరేట్ అంటూ నినాదాలు చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు మేరకు రైతాంగం పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. దేశంలోని రైతులను, వ్యవసాయ రంగాన్ని దోచుకుంటున్న కార్పొరేట్ కంపెనీలు, బడా వ్యాపారులకు దేశం నుంచి తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఏలియా, కార్మిక సంఘాల నాయకులు క్రిష్టన్న, రామచంద్రుడు, సర్వోత్తమ రెడ్డి, ఎల్లకృష్ణ, గోపాలు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో విద్యారంగం నిర్వీర్యం


సమావేశంలో మాట్లాడుతున్న నాయక్

డోన్ టౌన్: పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా విద్యార్థులకు పూర్తి స్థాయిలో పుస్తకాలు అందించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎం నాయక్, నక్కి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన మండలస్థాయి ప్లీనరీలో వారు మాట్లాడారు. పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కనీస సౌకర్యాలు, పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించలేని దుర్భర స్థితిలో ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అశోక్, విజయ, మనోజ్, అక్బర్, మాబు, మహేష్, నవదీప్, వినోద్ తదితరులు ఉన్నారు.

హత్యా రాజకీయాలకు చంద్రబాబుదే బాధ్యత


మాట్లాడుతున్న సీపీఐ నేత రామాంజనేయులు

డోన్ రూరల్: రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ హత్యలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్తి బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని నక్కిరామన్న భవనంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని తెలిపారు. మహానంది మండలం సీతారామపురంలో సుబ్బరాయుడు దారుణ హత్యకు గురికావడమే ఇందుకు నిదర్శనమన్నారు. హత్యా రాజకీయాలు మనుకుని కరువు ప్రాంతమైన రాయలసీమకు కనీసం తాగు, సాగు నీరు ఇవ్వాలని కోరారు. ప్రతీకార చర్యలను పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సుంకయ్య, రాధాకృష్ణ, నారాయణ, వరదరాజులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

నంద్యాల(అర్బన్): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ మురళీ కల్యాణి, ఐసీడీఎస్ నంద్యాల అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ చంద్రకళ తెలిపారు. స్థానిక జిల్లా మహిళా సమాఖ్య సమావేశ భవనంలో శుక్రవారం సాయంత్రం భేటి బచావో.. భేటి పడావో..వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. కడుపులోనే భ్రూణ హత్యలకు పాల్పడకుండా ఆడపిల్లలను రక్షించి చదివించాలన్నారు. ఎవరూ ఆడపిల్లను తక్కువగా చూడవద్దని, అలాంటి సమస్యలు ఎదురైతే 1098, 100 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

నేడు అవుకు రిజర్వాయర్‌కు జలహారతి

అవుకు: అవుకు రిజర్వాయర్‌కు జీఎన్‌ఎస్‌ఎస్, ఎస్సార్బీసీ కాలువల ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతోందని ఎస్సార్బీసీ ఈఈ సురేష్ బాబు శుక్రవారం తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన జలహారతి కార్యక్రమానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే, పలువురు నాయకులు, అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

దంపతులపై దాడి

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల గ్రామానికి చెందిన దంపతులపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. ఎస్‌ఐ వరప్రసాద్ వివరాల మేరకు.. వివాహేతర సంబంధం విషయంలో గ్రామానికి చెందిన ఓబులేసు రవితేజ అనే వ్యక్తిని కొట్టాడు. అతను ఈ విషయాన్ని ఇంట్లో చెప్పగా రవితేజతోపాటు తండ్రి భాస్కర్, తమ్ముడు విజయ్ ఇంటి వద్దకు వెళ్లి ఓబులేసు, అతని భార్యపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త బస్టాండ్, డేవిడ్ నగర్, కేయి మాదన్ననగర్, ఇందిరానగర్, నెహ్రూనగర్, కొత్తపేట, కృష్ణానగర్, పండరినగర్, పాతపేట, పాతబస్టాండ్, సుందర్‌సింగ్‌కాలనీ, పోలీస్‌స్టేషన్, కొండపేట, ప్రభుత్వ ఐటీఐ, ఒనైరో స్కూల్, వెంకటనాయినపల్లె రోడ్డు, సాయినందన్ తదితర కాలనీల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

12 నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

డోన్ రూరల్: పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఈనె 12 నుంచి 14వ తేదీ వరకు మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని సూచించారు.

ఐదుగురిపై కేసు నమోదు

అవుకు: దాడి ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రామయ్య శుక్రవారం తెలిపారు. వివరాలు.. అవుకు మండలం కొండమనాయునిపల్లెలో స్థలం విషయంలో గ్రామానికి చెందిన కొందరు పెనుగొండ వెంకటమ్మను దుర్భాషలాడుతూ కొట్టడమే కాకుండా ఆమె కుమారుడు పెనుగొండ రమణపై రాడ్డుతో దాడి చేశారు. బాధితుడు పెనుగొండ రమణ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన పెనుగొండ వెంకటేష్, కోనేటి సంటెన్న, కోనేటి సంజన్న, పడిగె పెద్దమద్దిలేటి, మానిపాటి రవిలపై కేసు నమోదు చేశామని వెల్లడించారు.

వ్యాసరచన పోటీలకు స్పందన

డోన్ టౌన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బాలికల పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విద్యార్థుల నుంచి స్పందన లభించింది. స్ఫూర్తి ఎడ్యుకేషనల్ అకాడమి ఆధ్వర్యంలో 'నేటి సమాజంలో యువత పాత్ర' అనే అంశంపై 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పోటీలకు సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగేశ్వరరెడ్డి

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం చప్పగా సాగింది. సమావేశానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారని ముందుగా సమాచారం ఉండేది. అనివార్య కారణాలతో ఇద్దరు రాలేకపోవడంతో సభను వాయిదా వేసేందుకు అధికారులు ప్రయత్నించారు. అయితే సభ్యులు వాయిదాకు అంగీకరించలేదు. ఫోరం ఉంది కాబట్టి సభను నిర్వహించాలని కోరడంతో జరపాల్సి వచ్చింది. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మీర్జాపురం సర్పంచ్ లాయర్ మహేశ్వరరెడ్డి సభ దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. పెట్నికోట నుంచి మీర్జాపురం మీదుగా పేరుసోముల వరకు డబుల్ రోడ్డు నిర్మించాలని కోరారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వచ్చే రబీ సీజన్‌లో రైతులకు ఆయా గ్రామాల్లోనే పంపిణీ చేయాలని, క్యూలో నిలబెట్టి ఇచ్చే పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. సభ తూతు మంత్రంగా జరగడంతో త్వరగా ముగిసింది. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగేశ్వరరెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి, వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం


కేజీబీవీ సిబ్బందికి సూచనలిస్తున్న జడ్జి తంగమణి

ప్యాపిలి: విద్యార్థినులు క్రమశిక్షణ, ప్రణాళికతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకుంటారని డోన్ అసిస్టెంట్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. పట్టణంలోని కేజీబీవీ పాఠశాలను శుక్రవారం జడ్జి తనిఖీ చేశారు. కేజీబీవీలోని వంటశాల, స్టోర్ రూం, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణాన్ని, తరగతి గదులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం జడ్జి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే విద్యార్థి దశలో కష్టపడి చదవాలని తెలిపారు. విద్యతోనే పేదరికం దూరం అవుతుందన్నారు. విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కేజీబీవీ సిబ్బందికి సూచించారు.

ఘనంగా నాగుల పంచమి వేడుకలు


అమ్మవారిశాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: నాగుల పంచమిని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని అమ్మవారిశాల వద్ద ఉన్న నాగులకట్ట, ఆరోగ్య కేంద్రం, శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణల్లోని పుట్టకు మహిళలు పాలు పోసి పూజలు చేశారు. గోర్లగుట్ట రహదారిలోని పుట్ట పెద్దమ్మకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సిమెంట్ నగర్, ఆర్‌ఎస్ రంగాపురం, ఆర్‌కొత్తపల్లె, బుక్కాపురం, కొలుముల పల్లె, గూటుపల్లె గ్రామాల్లోని పుట్టల వద్ద నూగుల పిండి, పెసర, మినుము బ్యాలను ఉంచి పూజలు చేశారు. పుట్టలో పాలుపోశారు.

చౌడేశ్వరిదేవికి వెండి వస్తువుల కానుక


వెండి ఆభరణను కానుకగా ఇస్తున్న దాతలు

బనగానపల్లె: మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారికి భక్తులు శుక్రవారం వెండి వస్తువులను కానుకగా ఇచ్చారు. రాజారామ్ దంపతులు రూ.41,591 విలువ చేసే 414.68 గ్రాముల వెండి బకెట్, ముప్పూరి నరేష్ రూ.31,000 విలువైన 250 గ్రాముల వెండి వడ్డానంను దేవస్థాన అర్చకులు ప్రదీప్ శర్మ, పవన్‌కుమార్ శర్మ, రామక్రిష్ణ శర్మలకు అందజేశారు. దాతలకు అమ్మవారి కుంకుమ, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

డోన్ రూరల్: మండల పరిధిలోని తాటిమాన్‌కొత్తూరు గ్రామానికి చెందిన గొల్ల మహేష్ అదృశ్యమైనట్లు భార్య ఉషారాణి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు డోన్ రూరల్ పోలీసులు తెలిపారు. నెల క్రితం డోన్‌కు వెళ్లొస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని.. బంధువులు, చుట్టు పక్కల గ్రామాల్లో గాలించినా ఫలితం లేకుండా పోయిందని ఫిర్యాదులో పేర్కొంది. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం


వై.విష్ణు(ఫైల్)

డోన్ రూరల్: మండల పరిధిలోని బి.రామదుర్గం గ్రామానికి చెందిన రామచంద్రుడు, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు వై.విష్ణు(20) శుక్రవారం అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు డోన్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.




బనగానపల్లె చౌరస్తా, ముదిగేడు టర్నింగ్ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లు

ఈ రోడ్లపై వెళితే దబిడిదిబిడే!

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల ఆర్‌అండ్‌బీ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పట్టణంలోని బనగానపల్లె చౌరస్తా నుంచి ముదిగేడు రహదారిలో పలు చోట్ల రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. రాళ్లు తేలాయి. చిన్నపాటి వర్షానికీ ఆ గుంతల్లో నీరు చేరుతున్నాయి. వాహన చోదకులు వర్షపు నీరు నిల్వ చేరిన గుంతలను పసిగట్టకపోవడంతో కింద పడి గాయాలపాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టి ప్రయాణీల కష్టాలు తీర్చాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

యాగంటిలో వేలం పాట వాయిదా

బనగానపల్లె: యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 14వ తేదీ జరగాల్సిన సీల్డు టెండర్, బహిరంగ వేలాన్ని కొన్ని అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు దేవస్థాన కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు దేవదాయశాఖ అధికారుల సమక్షంలో నిర్వహిస్తామని, ఆసక్తిగల వారు డిపాజిట్లు చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.